క్లుప్తంగా

నేడు మంత్రి పర్యటన

రొద్దం: స్త్రీ , శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీచరణ్ మంగళవారం రొద్దం మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో కార్యకర్తలతో సమావేశం కానున్నట్లు ఎంపీపీ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 8:30 గంటలకు దొడగట్ట, 10 గంటలకు రెడ్డిపల్లి, 11 గంటలకు పెద్దగువ్వలపల్లి, 1 గంటకు రొద్దం–1, 2:30 గంటలకు పెద్దకోడిపల్లి, 4 గంటలకు ఆర్ లోచెర్ల, 5 గంటలకు తురకలాపట్నం గ్రామాల్లో పర్యటిస్తారన్నారు.

వడదెబ్బపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

పెనుకొండ: మండలంలోని రాంపురం హైస్కూల్‌లో ఎన్ఎస్ఎస్ యూనిట్–3 ఆధ్వర్యంలో సోమవారం వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు డాక్టర్ మోహన్‌బాబు అవగాహన కల్పించారు. ఎండ పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు మంచి నీటిని బాగా సేవించాలన్నారు. శరీరంలో నీటి శాతం లోపిస్తే వడదెబ్బ తగులుతుందని, ఒక్కోసారి ప్రాణాపాయ పరిస్థితి కూడా ఏర్పడుతుందన్నారు.

15 మందిపై బైండోవర్ కేసులు

చిలమత్తూరు: మండలంలో 15 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ గంగాధర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎలాంటి గొడవలు చెలరేగకుండా వివాదాస్పద వ్యక్తులు, గొడవలు సృష్టించే వారిని గుర్తించి తహసీల్దార్ భాగ్యలత ఎదుట ప్రవేశ పెట్టి బైండోవర్ చేశామన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి

మడకశిర రూరల్: ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు దాహార్తిని తీర్చుకోవడానికి పట్టణంలోని అమరాపురంరోడ్డులో ఫోర్‌వీలర్స్ ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ ఆస్పత్రి, ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలలకు వచ్చే విద్యార్థులు, ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విగ్రహ ప్రతిష్టకు రూ.1.20 లక్షల విరాళం



విరాళం అందిస్తున్న అంగడి ప్రకాష్

లేపాక్షి: మండల పరిధిలోని బిసలమానేపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయంలో సీతారాముల విగ్రహాల ప్రతిష్టకు ఆ గ్రామానికి చెందిన అంగడి ప్రకాష్ రూ.1.20 లక్షల విరాళం అందించారు. ఈ మేరకు సోమవారం కమిటీ సభ్యులకు ఆ మొత్తాన్ని అందజేశారు.

భక్తిశ్రద్ధలతో 'షబ్ ఏ బరాత్'

హిందూపురం: ముస్లిం సోదరులు 'షబ్ ఏ బారాత్'ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇందులో భాగంగానే మేళాపురం, ముక్కిడిపేట, ఆర్‌పీజీటీ, బెంగళూరు రోడ్డు, రహమత్‌పురంలోని మసీదుల్లో ఆదివారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి తదితరులు ముస్లింలకు అన్నదానం చేశారు.

ఫీజుతో సంబంధం లేకుండా హాల్‌టికెట్లు ఇవ్వాలి

హిందూపురం టౌన్: ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల్లో చదువుతున్న ఇంటర్ విద్యార్థులకు కళాశాల ఫీజులతో సంబంధం లేకుండా హాల్‌టికెట్లు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో వారు సమావేశం నిర్వహించి మాట్లాడారు.

బసవేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట



లేపాక్షి: మండలంలోని పి.సడ్లపల్లిలో నూతనంగా నిర్మించబడిన శివాలయంలో బసవేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్టను సోమవారం ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ అశ్వర్థనారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు నాగజ్యోతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

మేలిమి కానుక

- పేదింటి బిడ్డలకు వరం 'జగనన్న విద్యా కానుక'
- 1 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు ఉచితంగా కిట్ల పంపిణీ
- విద్యకు పెద్దపీట వేస్తున్న సీఎం వైఎస్ జగన్

మడకశిర నియోజకవర్గ సమాచారం

సంవత్సరం	లబ్ధి పొందిన విద్యార్థులు
2020-21	28,773
2021-22	29,020
2022-23	28,237
2023-24	27,811



జగనన్న విద్యాకానుక కిట్లతో విద్యార్థులు (ఫైల్)

మడకశిరరూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థుల కోసం ప్రవేశ పెట్టిన జగనన్న విద్యా కానుక పథకం పేద, మధ్య తరగతుల వారికి వరంగా మారింది. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ పథకం అమలును స్వాగతిస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం 2020 విద్యా సంవత్సరం నుంచి జగనన్న విద్యా కానుక పథకం అమలు చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించే 1వ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాం, సాక్స్‌లు, షూ, నోట్‌పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, బ్యాగులు, డిక్షనరీ తదితర 10 రకాల విద్య సామగ్రిని ఉచితంగా పంపిణీ చేస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తూ.. విద్యార్థుల చదువును ప్రోత్సహిస్తూ తల్లిదండ్రులపై భారాన్ని తగ్గించారు. ముఖ్యంగా విద్య ఉంటే ఆ కుటుంబం బాగుపడుతుందనే సదుద్దేశంతో పాఠ్య పుస్తకాల్లో ఎన్నడూ లేని విధంగా ఓ పక్క ఇంగ్లిష్, మరో పక్క తెలుగులో పాఠ్యాంశాలను ముద్రించి విద్యార్థులకు అందిస్తున్నారు. ఇలాంటి ముఖ్యమంత్రిగా ఉండటం పేద కుటుంబాలకు వరమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ జగనన్నకే మా మద్దతు ఉంటుందని చెబుతున్నారు.

పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య

నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి కార్పొరేట్ తరహాలో విద్యార్థుల చదువుకు ఇబ్బంది లేకుండా అన్ని హంగులతో సౌకర్యాలు కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను చూసి ప్రైవేట్ పాఠశాలల నుంచి విద్యార్థులు సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలకు చేరి విద్యను అభ్యసిస్తున్నారు. తల్లిదండ్రులు పిల్లలను చదివించడానికి పైసా భారం పడకుండా ప్రభుత్వం జగనన్న కిట్లు, అమ్మఒడి పథకం ద్వారా తల్లుల ఖాతాల్లోకి రూ.15 వేల జమ చేస్తోంది.

సౌకర్యాలు బాగున్నాయి



చదువుకోవడానికి ఇబ్బందులు లేకుండా నాడు–నేడు ద్వారా పాఠశాలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. ఆర్థిక స్థోమత లేని విద్యార్థులు విద్యను మానేయకుండా ఉన్నత స్థాయికి ఎదగడానికి దోహదపడుతుంది. విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, అమ్మ ఒడి, నాడు నేడు పథకాలు బాగున్నాయి. తల్లిదండ్రులపై పైసా భారం పడకుండా చదువుకోవడానికి అవసరమైన విద్యా సామగ్రిని అందించారు.

– హరిబాబు, 9వ తరగతి, బుళ్లసముద్రం పాఠశాల

విద్యలో విప్లవాత్మక మార్పులు



రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టుకుంది. కార్పొరేట్ తరహాలో విద్యను అందించి విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తోంది. విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత కల్పిస్తుండటంతో ప్రైవేట్ పాఠశాలల నుంచి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్నారు. క్రమంగా ప్రభుత్వ బడుల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. విద్యార్థులందరికీ సకాలంలో జగనన్న విద్యాకానుక కిట్లు అందిస్తున్నాం.

– భాస్కర్, ఎంఈఓ–1, మడకశిర మండలం

వైఎస్సార్‌సీపీకి ఒక్క అవకాశమివ్వండి



ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డి

హిందూపురం: నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే ఒకసారి వైఎస్సార్‌సీపీకి అవకాశం ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి అన్నారు. హిందూపురం మండలం మలూగురు గ్రామ పంచాయతీలో పర్యటించి ఇంటింటికీ వెళ్లి సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా వేణురెడ్డి మాట్లాడుతూ.... 'పురం'లో 40 ఏళ్లుగా టీడీపీకి చెందిన వారే ఎమ్మెల్యేలుగా ఉన్నా ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. బాలకృష్ణ ఎమ్మెల్యేనన్న సంగతి మర్చిపోయి సినిమాలకే పరిమితమయ్యారన్నారు. పీఏల పాలనతో ప్రజలు కూడా విసిగిపోయి ఉన్నారని తెలిపారు. ఒక్కసారి వైఎస్సార్‌సీపీకి అవకాశం ఇస్తే పురంను అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ తులసి, వైస్ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాము, జేసీఎస్ కన్వీనర్ గిరి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం



పీ బ్యాడేగెరలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు శాంతమ్మ, ఈర లక్కప్ప

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు శాంతమ్మ, ఈర లక్కప్ప

అగళి: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా సమష్టిగా పనిచేద్దామని వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ, మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈర లక్కప్ప అన్నారు. సోమవారం పీ బ్యాడేగెర, హెచ్‌డీ హళ్లి, పంచాయతీలోని గ్రామాల్లో పార్టీ శ్రేణులతో కలసి ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా శాంతమ్మ, ఈర లక్కప్ప మాట్లాడుతూ.. గత ఐదేళ్ల కాలంలో అనేక సంక్షేమ పథకాలు పొందిన అన్ని వర్గాల ప్రజలు మరోమారు సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు ఎదురు చూస్తున్నారన్నారు. గ్రామస్థాయిలో నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా పనిచేసి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేసి జగనన్నకు కానుకగా అందిద్దామన్నారు. ఏ ఒక్కరూ పేదరికంలో ఉండకూడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. సంక్షేమ పథకాల అమలుతో పేదల గుండెల్లో సీఎం దేవుడిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. ఎలాంటి అవినీతి, దళారులు లేకుండా నేరుగా ప్రజల ఖాతాల్లోకి నగదును జమ చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. టీడీపీ, జనసేనతో పాటు విపక్షాలన్నీ ఏకమైనా ప్రజలు వారికి ఓటుతోనే సమాధానం చెబుతారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్ రెడ్డి, కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, రాష్ట్ర కార్యదర్శులు వైసీ గోవర్ధన్‌రెడ్డి, ఎంపీపీ రేణుక, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మహేంద్రప్ప, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప

రొళ్ల: మండల పరిధిలోని ఆవినకుంట గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు రమేష్, నవీన్‌కుమార్, తిమ్మేగౌడు తదితరులు తమ కుటుంబ సభ్యులు, అనుచరులతో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈర లక్కప్ప వారికి పార్టీ కండువా వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో పేదలకు అందుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై తాము వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్నట్లు వారు తెలిపారు. మళ్లీ వైఎస్ జగన్ సీఎం అయితేనే సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగుతాయన్నారు. వైఎస్సార్‌సీపీ విజయానికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నాగరాజు, విద్యార్థి విభాగం మండల కన్వీనర్ భూతేగౌడు, కోఆప్షన్ మెంబర్ అల్లాబకాష్, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసన్నకుమార్, వార్డు మెంబర్లు నగేష్‌గౌడు, రాజన్న, డీలర్ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం



మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

- మంత్రి ఉషశ్రీ చరణ్

సోమందేపల్లి: రాష్ట్ర ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమశాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ తెలిపారు. సోమవారం నాగినాయని చెరువు, సోమందేపల్లి, మాగేచెరువు, చల్లాపల్లి గ్రామాల్లో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ శ్రేణులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో ఎన్నికలకు అందరూ సిద్ధంగా ఉండాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు 99 శాతం అమలు చేశామని చెప్పారు. టీడీపీ హయాంలో సంక్షేమ పథకాలు లేవని, అభివృద్ధి జరగలేదన్నా విషయం ప్రజలకు బాగా తెలుసన్నారు. పొత్తుల పేరిట ఎన్నికలకు వస్తున్న టీడీపీ, జనసేనకు గట్టిగా బుద్ధి చెప్పడానికి జనం సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. గతంలో కన్నా అధిక మెజార్టీతో వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు గ్రామాల్లో కలిసికట్టుగా పనిచేసి పెనుకొండను వైఎస్సార్‌సీపీకి కంచుకోటగా మార్చాలన్నారు. పార్టీ కోసం కష్టపడే వారిని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, జెడ్పీటీసీ సభ్యుడు అశోక్, ఎంపీపీ గంగమ్మ, సర్పంచులు సౌజన్య, గంగాదేవి, ఉప సర్పంచ్ మమత, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు నాగభూషణంరెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు కంబాలప్ప, ఈశ్వర్, సింగిల్ విండో చైర్మన్ కొల్లప్ప, ఎంపీటీసీలు నాగప్ప, జితేంద్ర, హరీష్, నర్సింహులు, బాషా, మురళి, మారుతి, నరసింహమూర్తి, ఆదినారాయణరెడ్డి, అబ్దుల్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డోలోత్సవం



తిరువీధి ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అమరాపురం: స్థానిక లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం డోలోత్సవం నిర్వహించారు. అర్చకులు శ్రీనిధి భట్టాచార్యులు ఉదయం నుంచే స్వామివారికి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. సాయంత్రం ఆలయం ఆవరణలో డోలోత్సవాన్ని నిర్వహించారు. అలాగే స్వామి వారి ఉత్సవ విగ్రహన్ని చిన్న రథం పై కొలువుదీర్చి పురవీధుల గుండా తిరు వీధి ఉత్సవాన్ని నిర్వహించారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి



మాట్లాడుతున్న డాక్టర్ రామకృష్ణ

చిలమత్తూరు: దివ్యాంగులు ఆత్మ విశ్వాసమే ఆయుధంగా ముందుకు సాగాలని ప్రభుత్వ వైద్యుడు డా.రామకృష్ణ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని కొడికొండ చెక్‌పోస్ట్‌లోని సమర్థనం దివ్యాంగుల ట్రస్ట్‌లో వ్యక్తిత్వ వికాసంపై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంతో పోటీ పడుతూ అత్యంత ప్రతిభావంతులుగా దివ్యాంగులు మారుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సెంటర్ హెడ్ వెంకటేశ్వర్లు, ట్రైనర్ నరసింహులు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.


బాధితుడికి పరామర్శ

హిందూపురం అర్బన్: హత్యాయత్నం ఘటనలో గాయపడి హిందూపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పట్టణంలోని 17వ వార్డు వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్ సుహేబ్‌ను ఆ పార్టీ నాయకులు పరామర్శించారు. సోమవారం రాత్రి వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి రామచంద్రారెడ్డి, ఏపీపీ ఇందాద్, ఆసిఫ్, మన్సూర్, చాంద్‌బాషా, హుమయూన్ బాధితుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.



సుహేబ్‌ను పరామర్శిస్తున్న నాయకులు

వాలీబాల్ టోర్నీ విజేత 'హుబ్లీ రైల్వేస్'



ట్రోఫీ అందుకుంటున్న హుబ్లీ రైల్వేస్ జట్టు

పావగడ: స్థానిక గురుభవన్ క్రీడా మైదానంలో మూడు రోజులుగా పోటాపోటీగా జరుగుతున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో హుబ్లీకి చెందిన రైల్వేస్ జట్టు విజేతగా నిలిచింది. బళ్లారి జిందాల్ జట్టు రన్నరప్ ట్రోఫీని దక్కించుకుంది. హుబ్లీ జట్టుకు కప్‌తో పాటు రూ.50 వేల నగదుతో పాటు ట్రోఫీ అందించారు. రన్నరప్‌గా నిలిచిన బళ్లారి జిందాల్ జట్టుకు రూ. 40 వేల నగదు బహుమతి అందుకుంది. తృతీయస్థానంలో నిలిచిన బళ్లారి డీవైఎస్ఎస్ జట్టుకు రూ.30 వేలు, నాలుగో స్థానంలో నిలిచిన బెంగళూరు ఎల్ఐసీ జట్టుకు రూ.20 వేల నగదు బహుమతులు అందించారు. అలాగే విన్నర్ జట్టుకు క్రీడాభిమానులు రూ.10 వేలు, స్పోర్ట్స్ క్లబ్ రూ.20 వేలు ప్రోత్సాహక బహుమతులు అందించారు. రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను స్థానిక పావగడ స్పోర్ట్స్ క్లబ్ నిర్వహించినట్లు క్లబ్ కార్యదర్శి అబ్దుల్ షుకూర్ తెలిపారు.

రుచికరమైన భోజనం వడ్డించండి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీధర్

రొళ్ల: ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకం ద్వారా రుచికరమైన భోజనాన్ని వడ్డించాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని కె.గొల్లహట్టి ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. తొలుత రికార్డులు తనిఖీ చేయడంతో పాటు విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. తర్వాత ఎఫ్ఏ–4 పరీక్షల నిర్వహణపై ఆరా తీశారు. ఎంఈఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చదువుకు పెద్ద పీట వేసిందన్నారు. ఇందులో భాగంగానే కోట్ల రూపాయలు కేటాయిస్తోందన్నారు. ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ సభ్యులు పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సరస్వతి, ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమాభివృద్ధి



శిరగంవాండ్లపల్లిలో ప్రచారం చేస్తున్న చరణ్‌రెడ్డి

గోరంట్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతే ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. పేదలు మరింత అభివృద్ధి చెందాలంటే వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని మంత్రి ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన గోరంట్ల మేజర్ పంచాయతీ పరిధిలోని శిరగంవాండ్లపల్లి ,శివాలయంవీధి, రామశంకరయ్యకాలనీ, వినాయకనగర్‌లో సర్పంచ్ సరోజబాయి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలసి చరణ్‌రెడ్డి ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చరణ్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పాలేజయరాంనాయక్, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఫక్రుద్దీన్‌సాహెబ్, గోరంట్ల మార్కెట్ యార్డు ఉపాధ్యక్షులు నూర్‌మహమ్మద్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు బాషా, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పొటూరి శంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి



విద్యార్థులతో కలెక్టర్ అరుణ్‌బాబు

పెనుకొండ: విద్యతో పాటు సేవా కార్యక్రమాల్లో ముందంజలో ఉండాలని కలెక్టర్ అరుణ్‌బాబు విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సోమవారం కలెక్టర్, సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్‌తో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో ముచ్చటించారు. క్రమశిక్షణతో కూడిన విద్య ఉన్నత శిఖరాలకు తీసుకెళుతుందన్నారు. పోటీ పరీక్షలకు వెనుకంజ వేయకుండా బాగా ప్రిపేర్ అయి పరీక్షలు రాయడం ద్వారా మంచి ఉద్యోగ అవకాశాలు ఉంటాయని సూచించారు. ప్రిన్సిపాల్ కేశవరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లోకి పశువులు



రైల్వే ప్లాట్ ఫామ్, ట్రాక్‌పై తిరుగుతున్న పశువులు

హిందూపురం అర్బన్: హిందూపురం రైల్వేస్టేషన్‌లోకి పశువులు రావడం సర్వ సాధారణంగా మారింది. ఆవుల యజమానులు ఒక వైపు, రైల్వే సిబ్బంది మరోవైపు నిర్లక్ష్యం వ్యవహరిస్తుండటంతో ప్లాట్‌ఫాం, రైల్వే ట్రాక్‌లపై పశువులు హల్‌చల్ చేస్తున్నాయి. రైళ్లు నడుస్తున్న సమయంలో పశువులు రైల్వే ట్రాక్‌లపై సంచరిస్తుండటంతో ప్రయాణికులు ఆందోళనన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రైల్వేస్టేషన్‌లోకి పశువులు రాకుండా రైల్వే అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.